# ఊహాచిత్రం

– విన్నకోట సుశీలాదేవి

''మీరు కథలు రాస్తారుకదూ! మీ ఫోటో పత్రికల్లో చూశాను. మీ కథలు చాలా బాగుంటాయి.''

హఠాత్తుగా క్లర్కు సుందరం అలా అనేసరికి సూర్యారావు మొహమాటంగా నవ్వాడు. కించిత్తు గర్వం కూడా కలిగింది.

సూర్యారావు ఎలిమెంటరీ స్కూలు టీచరు. అప్పుడప్పుడు కథలు వ్రాస్తూ సాహితీలోకంలో కొంచెం పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఆ రచనలు చదివినవాళ్లు సూర్యారావుని టీచరుగానే కాక రచయితగా కూడా గుర్తించి గౌరవిస్తుంటారు.

ఈ ఆఫీసులో క్లర్కు తనని రచయితగా గుర్తించి గౌరవించినందుకు ఆనందించాడు.

''మాష్టారూ! మీ పని ఒక అరగంటలో అయిపోతుంది. ఇదుగో మీ అప్లికేషన్ మీద నోట్ రాసి డి.ఇ.ఓ. గారికి పంపిస్తున్నాను. వారి సంతకం పడగానే కాగితం మీ చేతికొస్తుంది.'' అంటూ వ్రాయడం పూర్తి చేసి ఫైలులో వేసి కట్టాడు. ప్యూన్ని పిలిచి ఆ ఫైలుని ఆఫీసరు గదిలో పెట్టమన్నాడు.

ప్యూను ఫైలు పట్టుకుపోయాడు.

''చాలా థాంక్సండీ. త్వరగా పని చేసిపెట్టారు'' అన్నాడు సూర్యారావు.

''అది మా డ్యూటీ. అందులోనూ మీలాటి రచయిత వచ్చాక ఆలస్యం చేస్తామా!'' అన్నాడు సుందరం.

ఆ మాటలకు సూర్యారావు గర్వంగా నవ్వాడు.

''కాస్సేపు కూర్చుంటారా. కాగితం వచ్చేస్తుంది.''

''ఆ.. అలా బయట వెయిట్ చేస్తా'' అంటూ సూర్యారావు లేవబోయాడు.

''అబ్బే! ఫర్వాలేదు. మీరిక్కడే కూర్చోవచ్చు'' అన్నాడు క్లర్కు.

మరోసారి కృతజ్ఞతలు చెప్పి కూర్చున్నాడు సూర్యారావు.

కొద్ది క్షణాలు గడిచాయి.

''రావుగారూ! మీకు నేను కొత్తగానీ రచయితగా మీరు నాకు చిరపరిచితులే. ఆ పరిచయం కొద్దీ మీకో విషయం చెప్పాలనుకుంటున్నానండీ!'' అన్నాడు సుందరం హఠాత్తుగా.

గోడమీది కేలెండరు వేపు చూస్తున్న సూర్యారావు తల తిప్పి, ''చెప్పండి సార్!'' అన్నాడు.

''ఇది నా స్వవిషయం. మీలాటి రచయితలు కనబడితే చెప్పుకోవాలని ఎన్నాళ్లనుండో చూస్తున్నా.''

సూర్యారావు కుతూహలంగా చూశాడు.

క్షణం ఆగి సుందరం అన్నాడు–

''అంటే ఇది నా ప్రేమకథ. మీరు విని తగిన సలహా ఇవ్వాలి.''

సూర్యారావు ఆశ్చర్యపోయాడు.

''మీరు రచయితగా ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపుతారు. నాది కూడా ఒక కథగా భావించి మీరు పరిష్కారం చూపాలి.''

సూర్యారావు తెల్లబోతూ అతనివేపు చూశాడు. అతడు పేరుకు మాత్రం సుందరం. మనిషిలో ఏమాత్రం సౌందర్యం లేదు. నల్లని రూపం. ఎత్తుపళ్లు– దుబ్బు జుట్టు. చిన్నకళ్ళు. చూడటానికే ఇష్టపడని అందం. ఇతడిని ప్రేమించే స్త్రీ వుంటుందా అనుకున్నాడు సూర్యారావు.

''మీరు తీరుబడిగా వున్నప్పుడు చెప్తాను నా ప్రేమకథ'' అన్నాడు సుందరం.

''సాయంత్రం స్కూలు అయ్యాక నాకు అంతా ఖాళీనే. రేపు నాల్గుగంటలకు మీరు మా స్కూలుకొస్తే, మా స్కూలు ప్రక్కనే మామిడితోట వుంది. అక్కడ కూర్చొని మాట్లాడుకోవచ్చు!'' అన్నాడు సూర్యారావు.

''సరే... అయితే రేపు సాయంత్రం వస్తా. వచ్చేటప్పుడు ఆ అమ్మాయి రాసిన ప్రేమలేఖలు తెస్తా'' అన్నాడు.

ప్రేమలేఖలా! అయితే తను అనుకున్నట్లు ప్రేమ ఏకపక్షం కాదు. ఆ అమ్మాయి కూడా ప్రేమించింది. బహుశా అందుకే ప్రేమ గుడ్డిది అన్నారు. అనుకున్నాడు సూర్యారావు.

ఇంతలో ప్యూను డి.ఇ.ఓతో సంతకం పెట్టించి ఫైలు తీసుకొచ్చాడు.

''ఇదిగోండి, మీ కాగితం'' సుందరం అందించాడు.

''చాలా థాంక్సండీ'' కాగితం అందుకుని ''రేపు సాయంత్రం వస్తారుగా'' అన్నాడు సూర్యారావు.

''ఆ... తప్పకుండా!''

• • •

మర్నాడు సాయంత్రం సరిగ్గా స్కూలు వదిలే సమయానికి వచ్చాడు సుందరం.

సూర్యారావు సైకిలు తీసుకుని–

''రండి సందరంగారూ!'' అన్నాడు. ఇద్దరూ స్కూలు ప్రక్కనే వున్న మామిడితోటలోకి వెళ్లారు.

''ఈ తోట మా స్కూలు సెక్రటరీ గారిదే!'' అన్నాడు సూర్యారావు.

మామిడిచెట్లు పూతమీద వున్నాయి. చెట్లన్నిటికీ చక్కని బోదెలు చేసి నీరు సమృద్ధిగా పెట్టారు. చెట్ల క్రింద ఒక్క ఆకుకూడా లేదు. ఒకచోట ప్రక్కగా సైకిలు స్టాండువేశాడు సూర్యారావు.

''రండి, ఇక్కడ కూర్చుందాం.''

''ఇప్పుడు చెప్పండి!'' అన్నాడు సూర్యారావు.

సుందరం చెప్పసాగాడు.

''నేనీ ఉద్యోగంలో చేరిన కొత్తలో నాకు నెల్లూరులో పోస్టింగు వచ్చింది. అక్కడ పనిచేస్తుండగానే నళినితో పరిచయమైంది. ఆమె టెలిఫోను డిపార్ట్‌మెంటులో పని చేసేది. మా పరిచయం ఎలా కలిగిందో అదంతా చెప్పి మిమ్మల్ని విసిగించను. నళినీ, నేనూ త్వరలోనే ప్రేమికులమయ్యాం. పెళ్లిచేసుకోవాలనుకుంటుండగా నళినికి హైద్రాబాద్ ట్రాన్స్‌ఫరయింది. వెళ్లేటప్పుడు నాతో అంది, ''సుందరం! మా నాన్నగారితో చెప్పి త్వరలోనే మన పెళ్లికి ముహూర్తాలు పెట్టించి నీకు నేను ఫోను చేస్తా. నా ఫోను కోసం ఎదురుచూస్తావు కదూ!'' అలా చెప్పి నళిని వెళ్లిపోయింది. ఆమె ఫోనుకోసం రెండు నెలలు ఎదురుచూశాను. ఇంతలో తెలిసింది, ఆమెకు పెళ్లి అయిందని'' అని చెప్పి ఆగాడు సుందరం.

''ఇక మీ ప్రేమకు ఫుల్‌స్టాప్ పడిందా!'' అడిగాడు సూర్యారావు.

ఆ మాటకు సుందరం నవ్వుతూ–

''లేదు మాష్టారూ, నా ప్రేమకథ ఇప్పుడు ఇక్కడి నుండే మొదలైంది!'' అన్నాడు.

అతడు నవ్వుతూంటే ఎత్తుపళ్లు ముందుకు పొడుచుకువచ్చి ముఖం మరింత వికృతంగా కనబడింది.

''నాకెన్నో ఆశలు కల్పించి, చివరికిలా చేసిందని నళిని



మీద నాకు చాలా కోపం వచ్చింది. హైదరాబాద్ వెళ్లగానే పెద్దవాళ్లతో మాట్లాడి ముహూర్తాలు పెట్టించి ఫోను చేస్తుందని, త్వరలోనే మా పెళ్లి జరుగుతుందని ఆత్రంగా ఎదురుచూస్తున్న నాకు ఆమె పెళ్లయిందనే కబురు ఎంతో బాధని కలిగించింది. ఒక స్థితిలో ఆత్మహత్య కూడా చేసుకోవాలనుకున్నాను. కానీ అనుకోకుండా ఆమె రాసిన ఉత్తరం మళ్లీ నాకు ఊపిరిపోసింది!'' అన్నాడు సుందరం.

సూర్యారావు తెల్లబోయాడు.

ఈ దేశంలోని ప్రతి ఆడపిల్లా తన పాత ప్రేమలన్నిటినీ పెళ్లితోనే సమాధి చేస్తుంది. అంతేకానీ పెళ్లయాక తిరిగి ఆ ప్రేమను కొనసాగించాలనుకోదు. అలా చేసిందంటే దానికేదో బలీయమైన కారణం వుండి వుంటుంది.

''ఆమె నాకు తరచూ ఉత్తరం రాయసాగింది. ప్రతి ఉత్తరంలోనూ నన్ను మర్చిపోలేక పోతోందని, మనసు లేని కాపురం చెయ్యలేకపోతున్నానని' ఒకసారి ఆమెని చూడాలని ఆరాటపడ్డాను. ఆ తర్వాత నాకీవూరు ట్రాన్స్‌ఫరయింది. ఆమె ఉత్తరాలు ఆగలేదు. హైదరాబాద్ వెళ్లి ఆమెని చూసి రావాలనుకుంటుండగా, అదృష్టవశాత్తు ఇటీవలే ఆమెకి కూడా ఈవూరు ట్రాన్స్‌ఫరయింది.

''ఏమిటీ, ఆమె ప్రస్తుతం ఈవూళ్లోనే వుందా?''

''అవునండీ, టెలిఫోను ఎక్స్ఛేంజిలో పనిచేస్తోంది.''

''అలాగా.''

''ఇవిగోనండి ఆమె రాసిన ఉత్తరాలు'' సుందరం ఒక అరడజను ఉత్తరాలు అందించాడు.

సూర్యారావు వాటిని తీసుకుని చదివాడు. ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రేమకావ్యంలా వుంది. చక్కని దస్తూరి. చివర నళిని అని సంతకం వుంది.

''ఇటీవలే నాకు ఒక రాత్రివేళ ఫోను చేసింది. 'ఇష్టంలేని కాపురం చెయ్యలేకపోతున్నానని, ఇద్దరం ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోయి హాయిగా బ్రతుకుదాం, త్వరలోనే నీ నిర్ణయం చెప్పు. ఆలస్యం చేస్తే పరిస్థితి విషమిస్తుందని'. ఆ ఫోను వచ్చినప్పటి నుంచీ నా మనసు మనసులో లేదు. ఏం చేయాలో తోచడం లేదు. మీలాటి రచయిత కోసం ఎదురుచూస్తున్నా. మీరు నాకు సలహా ఇవ్వాలి. నేనిప్పుడేం చేయాలో మీరే చెప్పాలి'' అన్నాడు సుందరం కొంత బాధగా, దిగులుగా.

సూర్యారావుకు అంతా అయోమయంగా వుంది. పెళ్లయిన స్త్రీ, తన ప్రియునితో లేచిపోవడానికి సిద్ధంగా వుంది. ఇప్పుడు తనేం సలహా ఇవ్వాలి. లేచిపొమ్మనాలా, వద్దనాలా?

''మాష్టారూ, మీరనేక ప్రేమ సమస్యలకి పరిష్కారం చూపారు కదా! నాకూ దారిచూపండి!''

''సుందరంగారూ! అవన్నీ కథలు. అవసరానికి తగినట్లు మన కిష్టమైన ముగింపులు ఇస్తాం. కాని ఇది జీవితం. తొందరపాటు తగదు. నిదానం అవసరం. అన్నివైపుల నుంచి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి'' అన్నాడు సూర్యారావు.

''అన్నిచోట్లా నిదానం పనికిరాదు. ఆలస్యం చేస్తే పరిస్థితి విషమిస్తుందని నళిని చెప్తోంది. కాబట్టి ఇక్కడ తొందర అవసరం. నళిని అక్కడ ఎన్ని బాధలు పడుతోందో. లేకపోతే అలా ఫోను చేయదు. నాకైతే వెంటనే వెళ్లి ఆమెని ఆ ఊబినుండి రక్షించాలని ఉంది'' ఆవేశపడ్డాడు సుందరం.

''ఇంతకీ మీకు పెళ్లయిందా!''

''ఆ... ఆయింది!'' తలొంచుకుని మెల్లగా అన్నాడు సుందరం.

సూర్యారావు నిట్టూర్చి ''అయితే మీరిక మీ ప్రేమను మరిచిపోవడమే మంచిది. పెళ్లిచేసుకున్న భార్యకు అన్యాయం చేయకండి. నళినికి కూడా అదే చెప్పండి. వివాహ ధర్మాన్ని గౌరవించడం మన సంప్రదాయం. లభించిన దానితో రాజీపడి జీవించడం మన ఆచారం'' నచ్చజెప్పబోయాడు సూర్యారావు.

## అజయ్-కాజోల్ విడిపోయారా?



ఏది ఏమైనా ప్రీతిజింతా వల్ల కాజోల్-అజయ్ దేవగన్ కొట్లాటలు మరింత ఎక్కువయ్యాయి. కాజోల్ ఫ్రెండ్‌ద్వారా తెలుసుకున్న నిజాలు ఆమెని టెన్షన్‌లో పెట్టాయి. అందుకే అజయ్‌కి చెప్పకుండా తల్లిదగ్గరికి వెళ్ళిపోయింది కాజోల్. ఇప్పుడు ప్రస్తుతం విడాకుల కోసం కాజోల్ ట్రై చేస్తోందని వినికిడి. ఏది ఏమైనా ఇది ఇండస్ట్రీలో మామూలే కదా!


## విశేషాలు

★ పదిహేను రోజుల షూటింగ్ తర్వాత మారిషస్ నుండి తిరిగివచ్చింది మహిమా చౌదరి. (మళ్ళీ విదేశాలకెప్పుడు అంటూ)

★ తుషార్‌కపూర్, ఈషాడియోల్ 'క్యాదిల్‌నే కహా' కోసం ఆగస్ట్ 15 నుండి హైద్రాబాద్‌లోనే వుంటారు. (ఏం చేస్తారని అడగొద్దు)

★ రాఘవేంద్రరావు డైరెక్షన్‌లో వస్తున్న ఓ హిందీ సినిమాలో టాబూకి అవకాశచం వచ్చింది. (ఎలాగబ్బా?)

-వినీల




''స్టాపిట్'' అరిచాడు సుందరం.

''మీరు రచయితలై కూడా ఇలాటి సలహా ఇస్తారా. పెళ్లి మా శరీరాలకయింది. కాని మా మనసుల్లోని ప్రేమ శాశ్వతం. అది ఎన్నటికీ విడిపోదు. ఇష్టం లేని సంసారాలు చేయడం మా వల్లకాదు. ఈ ఆధునిక యుగంలో కూడా ఇంకా సంప్రదాయాలు, ఆచారాలు అంటూ సుఖాల్ని బలిచేయడం మూర్ఖత్వం!'' అన్నాడు సుందరం ఆవేశంగా.

సూర్యారావు క్షణం ఆగి- ''మీ నిర్ణయం మీరు తీసుకున్నాక ఇక నన్ను అడగడం దేనికి?'' అన్నాడు.

''రచయితగా మా ప్రేమని ఆమోదిస్తారని, మమ్మల్ని ప్రోత్సహించి మాకు ఉత్సాహాన్నిస్తారని ఆశపడ్డాను!''

''రచయితగా ఇస్తానేమోగానీ... ఒక వ్యక్తిగా ఇవ్వలేను. మీ ప్రేమబంధాన్ని ఆమోదించను'' అన్నాడు సూర్యారావు.

''మీలో ఇద్దరు వ్యక్తులున్నారని నాకు తెలీదు. అయితే ఇక వస్తాను!'' సుందరం విసురుగా లేచి పెద్ద పెద్ద అంగలు వేస్తూ వెళ్లిపోయాడు.

సూర్యారావు ఆ రాత్రి చాలాసేపటివరకూ సుందరం గురించే ఆలోచించసాగాడు. ఇద్దరూ ప్రేమించుకున్నారు. విధికి తలవంచి వేరే పెళ్లిళ్లు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ప్రేమని మర్చిపోలేక బాధపడుతున్నారు. తమకు జరిగిన పెళ్లిని కాదని, ప్రేమతో తిరిగి ఏకమవ్వాలని కోరుకుంటున్నారు. వారి ప్రేమ ఎంత గాఢమైందో ఆ ఉత్తరాలు చెప్తున్నాయి. ఇందులో ఏమాత్రం అసత్యంలేదు. కాని.. ఎందుకో తనీ ప్రేమను అంగీకరించలేకపోతున్నాడు. వైవాహిక జీవితాన్ని కాలదన్నామని వెళ్ళిపోవడాన్ని హర్షించలేకపోతున్నాడు.

సుందరం లాటి అనాకారిని వలచి- అతని కోసం తపించిపోతున్న ఆ స్త్రీ ఎవరోకాని బాహ్యమైన అందానికి ప్రాధాన్యమివ్వకుండా మనసుని ప్రేమించిన ఆమెని ఒక్కసారి చూడాలి అనుకున్నాడు సూర్యారావు.

• • •

ఆరోజు సాయంత్రం స్కూలు అవగానే టెలిఫోన్ ఎక్స్ఛేంజికి బయలుదేరాడు. ఆమె ఎక్కడుంటుందో క్రిందటి రోజే తెలుసుకోవడంతో మేడమెట్లెక్కి సరాసరి ఆమె గదికెళ్లాడు. ఆ గదిలో ఆమెకాక మరో ఇద్దరున్నారు. సూర్యారావు లోపలికొచ్చి-

''నళినిగారు కావాలి'' అన్నాడు.

''ఆమే నళిని'', ఒక ప్రక్కగా కూర్చున్న స్త్రీని చూపారు.

సూర్యారావు అటువేపు చూశాడు. ఆమె తలొంచుకుని ఏదో రాసుకుంటోంది.

దగ్గరికెళ్లి 'నమస్తే మేడమ్' అన్నాడు సూర్యారావు.

ఆమె తలెత్తింది.

ఆమెని చూసి అప్రతిభుడైపోయాడు. అందానికి నిర్వచనంలా వుందామె. పచ్చని శరీరచ్ఛాయ. అద్భుతమైన ముఖసౌందర్యం. తను ఎన్నో కథల్లో వర్ణించిన అందం కళ్లముందు నిలిచినట్లయింది.

''ఎవరు కావాలి?''

''నళినిగారు.''

''నేనే కూర్చోండి'' అంది.

సూర్యారావు కూర్చున్నాడు.

ఆమె రాయడం ఆపి ఆ కాగితం టేబిల్‌పైన పెట్టింది.

''జయా! నేను ఒక గంట పర్మిషన్ కోసం రాసి ఇక్కడ పెట్టాను. జె.ఇ.గారు వస్తే ఇవ్వు!'' అంది.

''అలాగే.. ఇంటికెడ్తున్నావా!'' జయ అడిగింది.

''ఆ.. మావారొస్తారు'' అంటూ టేబిల్ సర్దింది. లేచి బీరువా తాళాలు వేసింది.

''చెప్పండి'' అంది సూర్యారావువైపు తిరిగి.

''కానివ్వండి.. మీరు పనిలో వున్నట్లున్నారు.''

''నేను బయటికి వెళ్లాలి. మీరొచ్చిన పనేమిటో చెప్పండి'' అందామె. అక్కడ- ఆ గదిలో ముగ్గురు ఆడవాళ్ల ముందు నళినితో సుందరం విషయం ఎలా మాట్లాడేది అనుకుంటుండగా- ''నళినీ'' అంటూ ఒక వ్యక్తి, లోపలికి వచ్చాడు.

''వచ్చేశారా! మీకోసమే చూస్తున్నా!'' అంటూ లేచింది నళిని.

సూర్యారావు అతనివైపు చూశాడు. ఎర్రగా- పొడవుగా చూడగానే ఆకర్షించే విధంగా వున్నాడు. ఇద్దరూ చూడముచ్చటగా ఒకరికోసం ఒకరు పుట్టారా అన్నంత అందం- ఆకర్షణతో మెరిసిపోతున్న వారిని చూసి తెల్లబోయాడు సూర్యారావు. లోకంలో భార్యాభర్తల్లో ఒకరు అందంగా వుంటే మరొకరు అనాకారిగా వుంటారు. కాని వీళ్లిద్దరూ ఎంత అందమైన జంట- అనుకున్నాడు.

''ఏవండీ! పాపని తీసుకెళ్దొద్దూ.''

''వెళ్లేటప్పుడు దారేగా. క్రష్‌లో నుండి పాపకి తీసుకెడదాం'' అన్నాడతను.

వాళ్లు ఎక్కడికో వెళ్లాలని తొందరపడుతున్నారని గ్రహించాడు సూర్యారావు. తనూ లేచి నిలబడ్డాడు.

అది చూసి నళిని ''మీరేదో పనిమీద వచ్చినట్లున్నారు. చెప్పండి'' అంది.

''అబ్బే మరేంలేందండీ! సుందరంగారిని గూర్చి.. అదే డి.ఇ.ఓ. ఆఫీసు క్లర్కు సుందరం గురించి మాట్లాడాలని..'' అంటూ ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమె హ్యాండ్‌బ్యాగ్ తగిలించుకుని-

''ఏదైనా టెలిఫోను ప్రాబ్లెమా? నేను మావారితో కలిసి అర్జంటు పనిమీద వెడుతున్నా. జయా! వీరి పని చూడు. ప్లీజ్ ఆమె దగ్గరకెళ్లండి.''

''పదండి!'' అంటూ భర్త చేతిని పట్టుకుని గబగబా బయటికి నడిచింది. అప్పటివరకూ సూర్యారావుతో పాటు ఆ జంటని చూస్తున్న మిగిలినవాళ్లు- ఉస్సురని నిట్టూర్చి తలలు తిప్పుకున్నారు.

''ఆయన నళిని భర్తగారా? ఏం చేస్తుంటారు?'' అనడిగాడు సూర్యారావు.

''అవునండీ. ఆయన గవర్నమెంటు కాలేజీ లెక్చరరు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి పంచ ప్రాణాలు. క్షణం

వదలరు. హు.. అటువంటి జీవితం లభించడం- ఎంతో అదృష్టం. పూర్వ పుణ్యసుకృతం..'' అంది జయ నిట్టూరుస్తూ.

''ఇంతకీ మీ ప్రాబ్లెమ్'' అంది.

''రేపు ఆ సుందరాన్నే తీసుకొస్తాలెండి'' అని బయటికి వచ్చాడు సూర్యారావు.

ఇదంతా చూస్తుంటే అతనికి బుర్ర తిరిగిపోతున్నట్లనిపించింది. సుందరం చెప్పిన మాటలకు ఇక్కడ నళిని ప్రవర్తనకు పొంతనే కనబడలేదు. భర్త దగ్గర నళిని నటిస్తోందా? అంటే అదీ కాదనిపిస్తోంది. తను సుందరం పేరెత్తగానే ఆమె ముఖంలో మార్పు వస్తుందనుకున్నాడు. కానీ అసలా పేరే విననట్లు ఆమె ప్రవర్తించింది కదా! హఠాత్తుగా ఆ పేరు వినగానే కొంతైనా కలవరపాటు కలగాలి కదా! అదేం లేదే! అదీకాక ఇక్కడ ఇంత అన్యోన్య దాంపత్యాన్ని విడిచి సుందరం వెంట పోదామని కోరుకుంటుందా. అంత అందమైన మొగుడిని వదిలి ఏమాత్రం అందంలేని సుందరాన్ని కోరుతుందా? బహుశ ఆమె భర్త శాడిస్టుకాదుగదా! ఏమో ఆ అందం చాటున ఏ దుర్లక్షణాలున్నాయో? కాని నళిని కేవలం భార్యే కాదు.. ఒక పాపకి తల్లి. మాతృమూర్తిగా ఆమె బాధ్యత పెరిగింది. ఆమె సుందరానికి అంత ప్రేమగా ఉత్తరాలు రాస్తుందంటే నమ్మలేకపోతున్నాడు. ఇదంతా మిస్టరీగా వుందే. నళిని రాసిన ఉత్తరాలు కూడా తను చదివాడు కదా! నళినిని చూస్తే మరొక వ్యక్తిని ప్రేమించే స్త్రీలా కనబడడంలేదు. భర్త కనబడగానే ఆమె కళ్లల్లో మెరిసిన కాంతి తను గమనించాడు. నిండు గృహిణి జీవితం అనుభవిస్తోన్న ప్రశాంతత ఆమెలో కనబడుతోంది. కాని సుందరం మాటల్లో నిజాయితీ వుంది. అతని ప్రేమలో స్వచ్ఛత వుంది.

ఎలా.. ఎలా.. ఈ రహస్యాన్ని ఛేదించడం.. ఆలోచించసాగాడు సూర్యారావు.

• • •

నాల్గురోజుల తర్వాత-

సుందరం ఆఫీసులో వున్న సమయం చూసుకుని అతని ఇంటికెళ్లాడు సూర్యారావు. తలుపు తట్టగానే ఒక స్త్రీ వచ్చి తలుపు తీసింది. ఆమెకు సుమారు పాతికేళ్లుంటాయి. సాధారణ రూపంలో అతి మామూలుగా వుందామె.

''సుందరంగారున్నారా?'' అనడిగాడు.

''లేరండీ! ఆఫీసుకెళ్లారు.''

''అలాగా!''

''ఆఫీసుకెళ్లండి. అక్కడ వుంటారు.'' అందామె.

''సరే ఒక గ్లాసుడు మంచినీళ్లిస్తారా'' అనడిగాడు సూర్యారావు.

''అలాగే.. లోపలికి రండి'' కుర్చీ చూపి తను లోపలికెళ్లి మంచినీళ్లు తెచ్చిచ్చింది. మంచినీళ్లు త్రాగి-

''నేను స్కూలు టీచరుని. అప్పుడప్పుడు కథలు రాస్తుంటాను. నా పేరు సూర్యారావు.'' అన్నాడు.

ఆమె ముఖం విప్పారింది.

''మీ పేరు తెలుసండి. మీ కథలు చదివాను. ఏం పని మీద వచ్చారు'' ఆదరంగా అడిగింది.

''మీరు సుందరంగారి భార్యా!''

''అవునండి.''

''మీ పేరు?''

''నా పేరు మహాలక్ష్మి'' అందామె సిగ్గుపడుతూ.

''చాలా బాగుందండి. పేరుకు తగ్గ రూపం. అచ్చం మహాలక్ష్మిలా వున్నారు.'' అన్నాడు.

ఆమె ఆ పొగడ్తకి చాలా సంతోషించింది. ''మీరు మెచ్చుకున్నారా? ఇంత చక్కని పేరు మా వారికి నచ్చలేదండి. ఆయన నా పేరు నళిని అని మార్చారు. అదేం పేరో, ఎందుకు మార్చారో తెలీదు. ఆ దిక్కుమాలిన పేరుతో పిలుస్తారు.'' అంది బాధ, కోపం మిళితమైన స్వరంతో.

సుబ్బారావు ఏదో అర్థమైనట్లు తోచి...

''నళిని పేరు సుందరంగారికి ఇష్టమేమో. భర్త ఎలా పిలిస్తే ఏంలెండి? నేనూ మా ఆవిడ్ని శ్రీదేవీ అంటా. ఆ సినీయాక్టరు నాకిష్టం.'' అంటూ నవ్వాడు.

''పిలుపు వరకైతే ఫర్వాలేదండీ. అప్పుడప్పుడు తనకి ప్రేమలేఖలు రాయమంటారు. నేను రాస్తే, అవి చదువుకుని ఆనందిస్తారు. అదేం పిచ్చో..'' ఆమె చెప్తోంది.

సూర్యారావుకు ఆ మాటల్తో ఇన్నాళ్ల మిష్టరీ మంచు వీడినట్టు విడిపోయింది. మనస్సు తేలికైంది. కాని సుందరం మీద జాలితో హృదయం భారమైంది. గాఢంగా ప్రేమించిన స్త్రీని పొందలేక- లభించిన జీవితంతో రాజీపడలేక నలిగిపోతూ- జీవితానికి ఊహలకు పొంతన కుదరక బాధపడిపోతున్నాడు. నళినిని ఎక్కడో చూశాడు. ఆమె అందాన్ని చూడగానే ఊహాప్రేయసి కళ్లముందు నిలిచినట్లయింది. ఆమెను ప్రేమించాడు. తన ప్రేమను తన మనసులోనే దాచుకున్నాడు. ఊహాప్రేయసితో కలల్లో విహరిస్తూ- కల నిజమవుతుందని భ్రమపడుతున్నాడు. భార్యని దుఃఖపెడుతున్నాడు. పాపం అమాయక ప్రేమికుడు ఏమయిపోతాడో?

''వెళ్లొస్తానమ్మా'' లేచాడు సూర్యారావు.

''ఎప్పుడైనా రండి మాష్టారూ. రచయితలంటే వారికి వల్లమాలిన అభిమానం..'' అందామె.

''తప్పకుండా వస్తానమ్మా!'' అంటూ బయటికి నడిచాడు.

రచయితలూ- ప్రేమికులు ఇద్దరూ ఊహాచిత్రకారులే. కాని రచయిత ఊహలు రచనల వరకే పరిమితమైతే- సుందరం లాటి ప్రేమికులు జీవితాన్నే ఊహాచిత్రంగా మలుచుకుని రెండింటికీ చెడుతున్నారు.

మంచికథ రాసి సుందరాన్ని మామూలు మనిషిగా చేయడం రచయితగా తన బాధ్యత అయితే- ఊహల్లో విహరిస్తూ- జీవితాన్ని నరకం చేసుకుంటున్న సుందరాన్ని ఒక మంచి మనస్తత్వశాస్త్రజ్ఞుడికి చూపి మామూలు మనిషిని చేయడం ఒక వ్యక్తిగా తన ధర్మం అనుకున్నాడు సూర్యారావు. ★

## కారణం



''ఏంటీ! మీనాన్న రోజూ తాగొచ్చి మీ అమ్మను కొడుతున్నాడా? ఇంతకు ముందు మీనాన్నకు ఆ అలవాటు లేదుకదా?!'' అడిగాడు హరి.

''అవును. మా నాన్న అలా చేయకపోతే రోజూ మా అమ్మ మా నాన్నను కొడుతోంది మరి.'' చెప్పాడు గిరి.

## అందం

''ఎందుకే అస్తమానూ నామీదే కాకుండా, ఇంటికి వచ్చిన వాళ్లమీద కూడా అలా కోప్పడతావు?'' అడిగాడు భర్త.

''అదేంటండో! మీరేగదా కోపంలో నేను మరింత అందంగా ఉంటానని అన్నారు. అందంగా కనబడటం మీకిష్టంలేదా'' అంటూ మరోసారి కోప్పడింది ఆ భార్యామణి.

- జి.రాజేంద్రప్రసాద్ (అంగలూరు)

## వేలు

బస్సు ప్రమాదంలో చిటికెన వేలు పోగొట్టుకున్న తాయారమ్మ లక్ష రూపాయల పరిహారం కోరుతూ కోర్టుకెక్కింది.

''చిటికెన వేలికి లక్ష రూపాయలంటే బాగా ఎక్కువ'' అన్నాడు అవతలి లాయరు.

''ఎక్కువేం కాదు, నేను మా ఆయన్ని ఆ వేలిమీదే ఆడించేదాన్ని'' అంది తాయారమ్మ.

## అదృష్టం

''ఐదో నెంబరు వార్డు అదృష్టం కలుగచేస్తుంది'' అంది నర్సు కొత్తగా చేరిన రోగితో.

''ఎలా?'' రోగి ఆశ్చర్యంగా అడిగాడు.

''మీకంటే ముందు ఈ బెడ్‌పై పడుకున్న రోగికి 55 ఏళ్లు. ఆయన పేరు కుటుంబరావు, అంటే ఐదక్షరాలు. ఐదో తారీఖు 5 గంటలా 5 నిముషాలకు ఆయన పోయారు.

- పి.స్వరాజ్యలక్ష్మి (హంపసాగర)

